ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

బుధవారం | 11 నవంబరు, 2026 | పేజీలు : 08

గుడిసెవాసులకు ఇంటి పట్టాలు



మెయిన్‌లో

19న ఇంటింటికి ఇందిరమ్మ బీమా పథకాన్ని
సిద్దిపేట వేదికగా ప్రారంభించనున్న సిఎం

సిఎం బహిరంగ స్థలాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి

ప్రజాపక్షం/సిద్దిపేట: ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈనెల 19న సిద్ది పేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే భారీ బహిరంగ సభ కోసం.. మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి మంగళవారం క్షేత్రస్థా యిలో సభా స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, రాకపోకలకు అను వైన మార్గాలపై అధికారులతో చర్చించారు. సభను విజయవంతంగా నిర్వహిం చేందుకు అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 19న సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభ వేది కగా రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ముఖ్య మంత్రి లాంఛనంగా ప్రారంభిస్తారని వెల్లడించారు. అలాగే మహిళలకు చిలక పచ్చ రంగు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలి పారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవే ర్చాలనే సంకల్పంతో ప్రజా ప్రభు త్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ప్రభుత్వ విజయాలతో పాటు భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమా లను కూడా ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. సిద్దిపేటతో పాటు దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, మానకొండూర్, సిరిసిల్ల తదితర నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ ఆరుగ్యారంటీలను విస్తృతంగా ప్రచారం చేయాలి: మంత్రి వివేక్‌వెంకటస్వామి

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలు, నూతన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ల డమే సీఎం ఈ సభ ప్రధాన ఉద్దేశమని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి అన్నారు. సభ వేది కగా అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్య క్రమమని, 20 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేస్తున్న ఘనత ప్రజా ప్రభుత్వానిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ హైమావతి, వివిధ నియోజకవర్గాల ఇంచార్జిలు పూజల హరికృష్ణ, చెరుకు శ్రీని వాస్ రెడ్డి, కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర పద్మశాలి కోపరేటివ్ సొసైటీ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం, ఆర్టిఏ నెంబర్ సూర్య వర్మ, మార్కెట్ కమిటీ చైర్మన్లు,, నాయకులు అత్తుఇమామ్, బొమ్మల యాదగిరి, రాజబహదూర్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



పెండింగ్ బిల్లులు
వెంటనే పరిష్కరించాలి



కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రజాపక్షం/భూపాలపల్లి : జిల్లాలో పీఎం శ్రీ, సమగ్ర శిక్ష పథకాల కింద చేపట్టిన పాఠశా లల అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలె క్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశిం చారు. మంగళవారం ఐడీఓసీ కార్యాల యంలో విద్యా, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ అధికారులతో అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపు, వినియోగంపై సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ, పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన ఎని మిది పాఠశాలలకు కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, పెండింగ్ బిల్లులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. పనుల్లో జాప్యంపై సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సైన్స్ ప్రయోగశాలలు, డిజిటల్ తరగతి గదులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆన్ లైన్ బిల్లుల సమర్పణ, ఖజానా, ఐఎఫ్ఎంఎస్ లాగిన్‌లలో ఎదురవుతున్న సాంకేతిక సమస్య లను పరిష్కరించాలని, నిధుల విడుదలకు అవసరమైన సవరణలు చేపట్టాలని సూచిం చారు. క్రీడా పోటీలు, స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలకు కేటాయించిన నిధులను నిబంధనల ప్రకారం వినియోగించుకోవాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సాంకేతిక సౌకర్యాలు అందు బాటులోకి తీసుకురావాలని, ప్రతి పనిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి లలిత, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం డీఈ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

వేయి స్తంభాల దేవాలయంలో
కార్తీక మాసోత్సవాలు ప్రారంభం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

ప్రజాపక్షం/హనుమకొండ : హనుమకొండలోని చారిత్రక శ్రీ రుద్రే శ్వర స్వామి (వేయి స్తంభాల దేవాలయం) ఆలయంలో కార్తీక మాసో త్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ సంద ర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పక్షాన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్తీక మాసోత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు.తెల్లవారు జామున బ్రాహ్మీ ముహూర్తంలో మంగళ వాయిద్యాల నడుమ ఉత్తిష్ఠ గణపతి ఆరాధనతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా మహి ళలు కులమతాలకు అతీతంగా సామూహికంగా దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడం ఈ మాసం ప్రత్యేకత అని తెలి పారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పుప్పాల ప్రభాకర్, నాగ రాజు, తోట వెంకటేశ్వర్లు, బోడ డిన్న తదితరులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి. అనిల్ కుమార్, ఉపేంద్ర శర్మ ఎ మ్మెల్యేకు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందించి ఆశీర్వచనం చేశారు.

కల్వర్ట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని..

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 7వ డివిజన్ కాకాజీ కాల నీలో డ్రైనేజీ కల్వర్ట్ నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మంగళవారం స్థానిక నాయకులతో కలిసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. కాకాజీ కాలనీ పరిధిలో ఆసుపత్రులు అధి కంగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో ప్రజలు, రోగులు, వాహనదా రులకు ఎలాంటి రవాణా ఇబ్బందులు కలగకుండా నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక డివిజన్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, సంబం ధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి పైపులైన్ మరమ్మతులు వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ఃఃః

భారీ బహిరంగ సభను విజయవంతం



ప్రజాపక్షం/తొర్రూరు: అఖిల భారత రైతు సంఘం 36వ మహాసభల సందర్భంగా ఈ నెల 15న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొల్లం అశోక్ అన్నారు. తొర్రూరు మండల కేంద్రంలో అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభల సందర్భంగా మండల రైతు సంఘం మండల కార్యదర్శి కొత్త వెంకట్‌రెడ్డి అధ్యక్షతన మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ భారతదేశ వ్యవసాయ రంగం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉందని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేదని, దేశం, రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో పురుగు మందులు ఆకాశాన్ని అంటాయని, ఎరువుల బస్తాలు గత ఏడాది కంటే ఇప్పుడు ఇక బస్తా 550 నుంచి రూ.600ల వరకు కేంద్ర ప్రభుత్వం రైతు మెడ మీద వేసిందన్నారు. భారతదేశంలో విద్యుత్ రంగాన్ని పూర్తిగా బడా కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పిందన్నారు. ఈ విద్యుత్ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రైతులకు అందుబాటులో యూరియా ఉండే విధంగా చూడాలని కోరారు. రైతుల సాగుకు, తాగునీటిని అందించి నిరంతరాయంగా 24గంటల కరెంటు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎండి.యాకూబ్, రైతు సంఘం సీనియర్ నాయకులు జన్నపురెడ్డి సోమిరెడ్డి, గడల సాయిలు, మారుపెల్లి నాగన్న, శ్రీను, పాల్గొన్నారు.

విద్యావేత్త దేవేందర్ రావు సేవలు చిరస్మరణీయం

ప్రజాపక్షం/గూడూరు: ప్రముఖ విద్యావేత్త శ్రీనిధి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపక చైర్మన్ మోతుకూరి వేదేందర్ రావు జయంతి వేడుకలను గూడూరు మండల పొనుగోడు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యా రంగానికి ఆయన చేసిన విశేష సేవలను ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన ఆయన కృషిని వక్తలు స్మరించుకున్నారు. విద్య ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలన్న ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయక మని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నితిన్, చంద్ర , సర్పంచ్ , రమేష్ మధు భిక్షపతి, వేణు దామెర స్టాలిన్ యాకస్వామి ,దేవేందర్ చారి కొండయ్య భాస్కర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నినో ప్రభావంపై రైతులకు సిఎం దిశానిర్దేశం

ప్రజాపక్షం/ములుగుః ఇంచర్ల రైతువేదికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల ప్రభావంపై వ్యవసాయశాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యాసంగి పంటల సాగు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటిస్తూ పంటల సాగు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఈఓ, ఏఎఓ, ఇంచర్ల సర్పంచ్ ముసలిపల్లి కుమార్‌గౌడ్, బరిగలపల్లి సర్పంచ్ వీరబోయిన రాజేందర్, రవియాదవ్, ఇంచర్ల ఏఓ, మహిళా సంఘాల సభ్యులు, ఇంచర్ల, బరిగలపల్లి, జంగాలపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

విలువలు విజయాలకు ప్రతీక స్వేరో ఆర్గనైజేషన్

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : విలువలు, విజయాలకు ప్రతీక స్వేరో ఆర్గనైజేషన్ ఇని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. స్వేరో ఆత్మీయ సమ్మేళనం కన్వీనర్ మంద శ్యామ్ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ కళా క్షేత్రం వద్ద స్వేరో ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం రోజున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ హాజరు అయ్యారు.అనంతరం పార్టీ శ్రేణులు, స్వేరో సభ్యులతో కలిసి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం రాసిన భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచన విధానం, స్ఫూర్తితో తెలంగాణ ప్రజలకు ఉద్యమ నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. కేసీఆర్ 1000పైగా గురుకులాలను ఏర్పాటు చేసి పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలు ఉన్నత విద్య అందేలా చేశారు. కేసీఆర్ ఆలోచనను ఆచరణలో చూపిన నాటి గురుకులాల సెక్రటరీ, నీతి నిజాయితీ



నిబద్ధత కలిగిన ఆఫీసర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అని కొనియాడారు. స్వేరో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఈ నెల 22న నిర్వహించనున్న స్వేరో ఆర్గనైజేషన్ కి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వేరో ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు, మాజీ ఐపీఎస్ అధికారి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్వేరోలు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నార్లగిరి రమేష్, పులి రజినీకాంత్, వేల్పుల వేణు, జానకిరాములు, సుంచు కృష్ణ, కాటాపూర్ రాజు, అష్టల్, ఎస్కే మహమూద్, యాదగిరి, శ్రీహన్, అర్జున్ మొదలగు వారు పాల్గొన్నారు.

హసన్‌పర్తి మీడియా పాయింట్ ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాపక్షం/హసన్‌పర్తి : హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల మీడియా పాయింట్ నూతన అధ్యక్షుడిగా జక్కుల విజయ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎర్రగట్టుగుట్ట కళ్యాణ మండపంలో మంగళవారం మండల జర్నలిస్టులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా జక్కుల విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సందెల సాగర్, ఉపాధ్యక్షులుగా, కోప్పుల రాజేందర్, దాడి భిక్షపతి, సందెల రాజు, కోశాధికారిగా దాడి చిరంజీవి, సహాయ కోశాధికారిగా మండ రాజేష్, కార్యదర్శులుగా బొక్క రాజు, వాజిద్, సహాయ కార్యదర్శులుగా రామంచ మధుకర్, చెన్నూరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.అదేవిధంగా సలహాదారులుగా సయ్యద్ అహ్మద్, దండు గూడెం రాజకుమార్, కార్యవర్గ సభ్యులు గా రేణికుంట్ల దుర్గాప్రసాద్, రాజారపు భిక్ష పతి,ఎర్ర కుమార



స్వామి,పెసరు సూర్య ప్రకాష్,చెంగేల్లి నరేష్ చారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు జక్కుల విజయ్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఐక్యతకు పెద్దపీట వేస్తానని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా పాయింట్ సభ్యులు.. కే కార్తీక్, బండారి సుమన్, పత్తిపాక విష్ణు మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి యజమానిని బెదిరించిన వ్యక్తులపై కేసునమోదు

ప్రజాపక్షం/వేలేరు : వేలేరు మ ండలం లోని సోడశపల్లిలో ఇంటి యజమానిని బెదిరించి సొంత ఇంటిలోకి వెల్లకుండా అడ్డుకున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన కీర్తి స్వామి తండ్రి చుక్కయ్య వయసు 40 సం,రాలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తూ అదే గ్రామానికి చెందిన సంకటి రాములు తండ్రి సాయిలు వద్ద జనవరి 9,2026 న ఇంటి నెంబరు 218 ని చట్టబద్దంగా కొనుగోలు చేసి స్వాధీనంలోకి తీసుకున్నాడు .అయితే సదరు ఇంటిని విక్రయించిన సంకటి రాములు బంధువైన వేముల సంపత్ తండ్రి వెకటయ్య వయసు 60



సం,రాలు అతని భార్య కోమల 55 సం,రాలు వీరిద్దరూ తమ కుటుంబ వివాదాలను మనసులో పెట్టుకొని 03,02,2026 రోజు ఉదయం 10 గం,లకు ఇంటి యజమాని కీర్తి స్వామి అక్కడ లేని సమయంలో అనుమతి లేకుండా ఇంటిలోకి ప్రవేశించి సంపత్ తల్లి లచ్చమ్మను అక్కడ ఉంచారు.ఇంటిని ఖాళీ చేయాలని కోరగా చంపేస్తామని బెదిరిస్తూ ఇంటిలోకి రాకుండా అడ్డుకుంటున్నారని బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు.

ఫిర్యాదురాలుపై విచారణ.. అధికారి దురుసు ప్రవర్తన

ప్రజాపక్షం/నడికూడ: నీవు ఇక్కడి నుండి వెళ్ళిపో.. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో..నీ దిక్కు ఉన్నచోట చెప్పుకో..నువ్వు గ్రామపంచాయతీ నుండి బయటికి వెళ్ళు అంటూ ఫిర్యాదురాలు పై విచారణ అధికారి డిపిఎం దయాకర్ దురుసుగా ప్రవర్తించాడని ఫిర్యాదురాలు దోమ సునీత నడి కూడ ప్రెస్ క్లబ్ లో మీడియా ముఖంగా మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో సునీత మాట్లాడుతూ నడికూడ మండలం ముస్త్యాలపల్లి గ్రామంలో మహిళ సమాఖ్య సంఘాల సిఏ బోట్ల విమల అవినీతి ఆరోపణల పై గత నెల 29వ తేదీ డిఆర్డిఓ శ్రీనుకు ఫిర్యాదు చేయడం జరిగిందని విచారణ నిమిత్తం పదవ తేదీ మంగళవారం డిపిఓ దయాకర్ విచారణకు రాగా గ్రామంలో మహిళా సంఘాల సభ్యుల వద్దకు వెళ్ళకుండా గ్రామపంచాయతీ వద్దకు మహిళా సంఘాల సభ్యులను అందరినీ ఒకే చోటకు పిలిచి తూతూ మంత్రంగా విచారణ చేపట్టడం జరిగిందని ఆరోపించారు. తనతో సహా అందరిని గ్రామపంచాయతీలో నిల బెట్టి విచారణ చేసినట్లు చేస్తూ నువ్వు ఇక్కడి నుండి వెళ్ళిపో, నీ దిక్కున్న చోట చెప్పుకో అంటూ దురుసుగా ప్రవర్తిస్తూ తనను గ్రామపంచాయతీ నుండి బయటికి వెళ్లగొట్టడం జరిగిందని ఆరోపించారు. ఒక లక్ష,లోను తీసుకుంటే వెయ్యి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న సీఏకు సపోర్ట్ చేస్తూ తనపై దురుసుగా ప్రవర్తించిన విచారణ అధికారిపై, అవినీతి ఆరోపణల కు పాల్పడుతున్న సిఏ పై జిల్లా కలెక్టర్ పూర్తి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని దోమ సునీత మీడియా సమావేశంలో వెల్లడించారు. గ్రామపంచాయతీ వద్దకు మహిళా సంఘాల సభ్యులను సుమారు 60 మందిని పిలిచి విచారించడం జరిగిందని, తనపై ఆరోపణలు చేస్తున్న దోమ సునీత పై తాను ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని డిపిఓ దయాకర్ తెలిపారు. తాను దురుసుగా ప్రవర్తించలేదని,అదే గ్రామానికి చెందిన ప్రత్యక్ష సాక్షులు, మహిళా సంఘాల సభ్యులు,గ్రామ సర్పంచ్ ఉపసర్పంచ్ ఉన్నారని, తనపై దోమ సునీత చేసే ఆరోపణలు అవాస్తవమని తెలిపారు.

నేరగాళ్లపై ఉక్కుపాదం..

ప్రజాపక్షం/భూపాలపల్లి: జిల్లాలో నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టడంతో పాటు పెండింగ్ కేసుల పరిష్కారంలో వేగం పెంచాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో పోలీస్ స్టేషన్ల వారీగా కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల ఫిర్యాదులను తక్షణమే స్వీకరించి, చట్టప్రకారం న్యాయం చేయాలని సూచించారు. దొంగతనాలు, గొలుసు దొంగతనాల నివారణకు రాత్రి గస్తీ ముమ్మరం చేయాలని, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, జూదం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పోక్సో కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, సైబర్ నేరాల బాధితులు వెంటనే 1930కు ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయడంతో పాటు హెల్మెట్, సీటుబెల్టు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాద బాధితులకు పీఎం రాహత్ పథకం ద్వారా రూ.1.50 లక్షల వరకు ఏడు రోజుల నగదు రహిత వైద్యం అందుతుందని, ప్రాణాలు కాపాడిన వారికి రహవీర్ పథకం కింద రూ.25 వేల ప్రోత్సాహకం లభిస్తుందని వివరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీలు ఏ.సంపత్ రావు, సూర్యనారాయణ, రెహమాన్, సీఐలు, ఎస్సైలు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కెకె కమిటీ కాలయాపన ఇంకెన్నాళ్లు?

ప్రజాపక్షం/ములుగుః తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై కేకే కమిటీ మరెంతకాలం జాప్యం చేస్తుందని ఉద్యమకారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి చంటి భద్రయ్య ప్రశ్నించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం గత తొమ్మిదేళ్లుగా డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు నిర్వహించామని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో హామీలు చేర్చినా, అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా అమలు చేయడం లేదని విమర్శించారు. కేకే కమిటీలో ఆరుగురు సభ్యులున్నా భిన్నాభిప్రాయాలతో నిర్ణయాలు ముందుకు సాగడం లేదన్నారు. ప్రభుత్వం నుండి సాయం అందుతుందన్న ఆశతో ఎదురుచూస్తున్న ఉద్యమకారులు ఒక్కొక్కరుగా మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే మృతి చెందిన ఉద్యమకారుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, 250 గజాల ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇళ్లు, నెలకు రూ.25వేల పింఛన్లు, బస్సు, రైలు పాస్‌లు కల్పించాలని కోరారు. ఇప్పటికైనా హామీలు అమలు చేయక పోతే కేకే కమిటీ సభ్యుల ఇళ్ల ముట్టడి, చావుడప్పు కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

సైబర్ నేరాలు, బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన

ప్రజాపక్షం/వాజేడు: కడేకల్లు గ్రామంలో మంగళవారం పేరూరు పోలిస్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా సామాజిక పోలిసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. ఆత్యవసర పరిస్థితుల్లో దయల్ 112 ద్వారా పోలీసుల సహాయం పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో పేరూరు ఎస్సై ఆర్. అశోక్‌తో పాటు పోలీస్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

ప్రజాపక్షం/ములుగుః మల్లంపల్లి మండలంలోని వివేకానంద హైస్కూల్‌లో విద్యార్థులకు కనీస వసతులు కల్పించకుండా విద్యా హక్కు చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్(బిఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజశేఖర్ వర్మ ఆరోపించారు. పాఠశాలపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ అధికారి(డిఈఓ)కు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, తరగతి గదులు లేవని తెలిపారు. ఈ సమస్యలపై పలుమార్లు ఎంఈఓ దృష్టికి తీసుకెళ్ళినా స్పందన లేదని విమర్శించారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలోని వసతులపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలు పాటించని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల భద్రత, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తక్షణమే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలుగా గుమ్మడి శ్రీదేవి



ప్రజాపక్షం/చిట్యాలఃజ యశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలుగా చిట్యాల మండలానికి చెందిన గుమ్మడి శ్రీదేవి నాలుగ వసారి ఎంపికయ్యారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతా నికి, పార్టీ కార్యక్రమాల విజయవంతానికి ఆమె చేసిన కృషిని గుర్తించిన రాష్ట్ర పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఈ నియామకం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ తన సేవలను గుర్తించి మరోసారి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్ప గించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్య క్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలి పారు. భూపాలపల్లి ఎంఎల్‌ఏ గండ్ర సత్యనారా యణ రావు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వర్ణలత, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కరుణాకర్‌కు ప్రత్యేక ధన్యవా దాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రజ ల్లోకి తీసుకెళ్తూ, మహిళలకు వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఎంపేడులో అక్రమ రవాణాపై పాలకవర్గం సీరియస్



ప్రజాపక్షం/టేకుమట్లఃజయశంకర్ భూపాలపల్లి జిల్లా మండలం ఎంపేడు గ్రామంలో గత కొన్ని రోజులుగా అక్రమంగా సాగుతున్న ఇసుక రవా ణాపై గ్రామ పంచాయతీ పాలకవర్గం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో మంగళ వారం రోజున ఇసుక ట్రాక్టర్ యజమానులను, సంబంధిత వ్యక్తులను పంచాయతీ కార్యాలయా నికి పిలిపించి పాలకవర్గం ప్రత్యేక సమావేశం నిర్వ హించింది. ఈ సందర్భంగా పాలకవర్గం మాట్లా డుతూ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసు కను తరలించడం వలన భూగర్భ జలాలు దారు ణంగా పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల వలన భూగర్భ జలాలు సరిగ్గా పెరగకపోగా, ఇలా అక్ర మంగా ఇసుక తోడేస్తే రాబోయే రోజుల్లో గ్రామంలో తీవ్రమైన తాగు, సాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటి వరకు జరిగినదాన్ని పక్కనపెట్టి, ఇకపై ఎవరైనా అక్ర మంగా ఇసుక రవాణాకు పాల్పడితే వారిపై చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ ఇసంపెల్లి హారిక, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు తేల్చి చెప్పారు.

సత్యనారాయణ కుటుంబానికి ఆర్యవైశ్య ప్రముఖుల పరామర్శ

ప్రజాపక్షం/నెక్కొండఃనెక్కొండ మండల కేంద్రా నికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి చిదురాల సత్య నారాయణ మృతి పట్ల ఆర్యవైశ్య ప్రముఖులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామ ర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్ర మంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తాటిపల్లి శివకుమార్, రాము, దొడ్డ విజయ్, నగేష్, కృష్ణమూర్తి,శివయ్య, భాస్కర్, శ్యాంసుం దర్, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోలీస్ క్రికెట్ పోటీల్లో సత్తా చాటాలి



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 5వ రాష్ట్రస్థాయి పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్–2026 లో పాల్గొనేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ తరపున క్రికెట్ జట్టును ఎంపిక చేశారు.ఈ జట్టుకు గీసు గొండ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి.విశ్వేశ్వర్ నాయ కత్వం వహించనున్నారు.ఈ సందర్భంగా ఎంపికైన క్రికెట్ జట్టు సభ్యులను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ అభి నందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడా స్ఫూర్తితో ఆడి, ఉత్తమ ప్రతిభ కనబరిచి వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జట్టు సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

బాలికల అక్రమ రవాణా బాల్య వివాహాలు, లైంగిక వేధింపులపై సదస్సు



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : మానవ బాలల అక్రమ రవాణా నిర్మూలనపై అలాగే బాల్య వివాహాలు, బాలిక లపై లైంగిక వేధింపులు, సైబర్ క్రైమ్ మొదలగు అంశా లపై ఎఫ్ఎంఎం సాంఘిక సేవ సమితి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ఈసంపల్లి సుదర్శన్ ఆధ్వర్యంలో, ఎంజేపీ టీబీసీఆర్ స్కూల్ (గర్ల్స్) ఆరెపల్లి, పైడిపల్లి నందు గల తెలంగాణ బ్యాక్ వార్డ్ క్యాస్ట్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్ ప్రిన్సిపల్ ఎం.సరిత అధ్యక్షతన ఈ సమావేశం జరిగినది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వరంగల్ బాలల సంక్షేమ సమితి చైర్ పర్సన్ వసుధ మాట్లాడుతూ భారత దేశంలో ఎక్కువ బాలికలు సోషల్ మీడియాకు అడిక్ట్, లవ్ పేరు మీద, టీవీ స్టార్, సినిమా స్టార్ , ఆశతో గొప్ప ఉద్యోగాలని మానవ, బాలల అక్రమ రవాణకు గురవుతున్నారని, ఇన్ స్టాగ్రామ్ , ఆన్ లైన్ చాటింగ్,ఒక ప్రదేశం నుంచి ఇంకొక ప్రదేశా నికి పని పేరు మీద, ఉద్యోగం పేరు మీద, మ్యారేజ్ మ్యాట్రిమోనీ పేరా, ఇతర దేశాలలో, ఉద్యోగాల ఆశ చూపి మభ్యపెట్టి వారిని ఇండియా నుండి ఇతర దేశా లకు, ఇతర రాష్ట్రాలకు, పంపిస్తూ వారిని లైంగికంగా వేధిస్తూ వారి పట్ల హింస నేరా ప్రవృత్తి కలిగి నేర చరిత ముఠాలు సైబర్ నేరగాళ్లు అవయవాల దోపిడితోపాటు, వ్యభిచారులుగా, వెట్టి చాకిరి పనికి కార్మికులుగా, దుర్భర జీవితాలుగా మారుస్తూ కొన్ని ముఠాలు నష్టప రుస్తున్నాయని చెప్పారు. అలాగే మహాత్మా జ్యోతి రావు పూలే గురుకులంలో సమావేశం పెట్టి బాలికలందరికి అలాగే ఏదైనా బాలికలకు ప్రమాదం, ఆపద వచ్చినట్ల యితే ఉచిత టోల్ ఫ్రీ నెంబర్స్ 100, 1098, 181, 112, 181, 1930 లకు ఫోన్ చేసి సాయం పొందా లని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. జ్యోతి రావు పూలే ప్రిన్సిపల్ ఎం. సరిత,వరంగల్ జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్ పర్సన్ (సిడబ్ల్యుసి) వసుధ ఏ హెచ్ టి యు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓ .రమేష్ ఏసుమా ముల, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి మృతి



ప్రజాపక్షం/లింగాలఘణపురం: మండలం లోని కిష్ట గూడెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఐలేని రామచంద్రారెడ్డి మృతిచెందగా, మంగళవారం పార్టీ నాయకులు వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆయన మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు మాట్లాడుతూ ఆయన మృతి పట్ల పార్టీకి తీరనిలోటని, వారు పార్టీ కార్యక్ర మంలో చురుకుగా పనిచేసే పార్టీ గెలుపు కోసం ముందు అంజలి నడిచేవారని వారిని కొనియాడారు. వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చౌదర పల్లి శేఖర్ మాజీ మండల అధ్యక్షులు ఏదునూరి వీరన్న స్థానిక సర్పంచ్ భూక్య నరసింహ ఉప సర్పంచ్ సంపత్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కరుణాకర్, గంగిడి రవీందర్ రెడ్డి, కన్నబోయిన రామచంద్ర ,గంగిడి ఇంద్రారెడ్డి, వార్డు సభ్యులు ధరావత్ రమేష్, మేకల రవి, వసపో తుల రాజు, లకవత్ రవీందర్, పార్టీ నాయకులు ధరా వత్ గణపతి, భూక్య యాదగిరి, ఐలేని తిరుమల్ రెడ్డి, నిమ్మ రాంరెడ్డి, సురేష్ రెడ్డి,చెప్పుల నారప్పరెడ్డి, ఐలేని రవీందర్ రెడ్డి, గంగిడి సంజీవరెడ్డి, నీలా సైదయ్య, కన్నె బోయిన మధు, ముహూర్తాల శీను, ఐలేని లింగారెడ్డి, గంగిడి వెంకట్ రెడ్డి, బోనోతు రాజేందర్, ఐలేని చిన్న రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేల ఆరోగ్యమే లక్ష్యంగా రైతు క్షేత్ర బడి శిక్షణ



ప్రజాపక్షం/కాటారం: రతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తూ భూసారాన్ని పరిర క్షించి అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో నిర్వహి స్తున్న రైతు క్షత్ర బడి ఎఫ్ఎఫ్ఎస్ శిక్షణా కార్యక్రమం మూడో రోజు మంగళవారం ఆర్వి రేగుల గూడెం గ్రామంలో ఘనంగా నిర్వహించారు.202627 ఆర్థిక సంవత్సరానికి సంబందించి ఆత్మ పథకంలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్నిచేప ట్టారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు రైతు లకు పలు అశాలపై అవగాహన కల్పించారు నేల ఆరోగ్య కార్డుల ప్రాముఖ్యత,మట్టి నమూనాల పరీక్షల ద్వారా భూమిలోని పోషక విలువలను గుర్తించడం వాటి ఆదారంగా సమతుల్య ఎరువుల వినియోగం చేవ ట్టడం ల్ల కలిగే ప్రయజనాలను వివరించారు.అలాగే బూసారాన్ని పెంపొందించేందుకు జీలుగు వంటి పచ్చి రొట్ట ఎరువుల పంటలను సాగు చేయాలని సూచిం చారు.కూరగాయల సాగులో ఆదునిక పద్ధతులనుపా టించాలని రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ సేంద్రియ వ్యవసాయానికి ప్రాదాన్యత ఇవ్వాలని సూచించారు.

ప్రకృతి అనుకూల వ్యవసాయ పద్ధతుల ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటుపెట్టుబడి ఖర్చు లను తగ్గించుకోవచ్చని వివరించారు.వేపనూనె పిచికా రిపై ప్రత్య ప్రదర్వన శిక్షనలో భాగంగా గ్రామానికి చెందిన ప్రగతిపీల రైతు దోమ తిరుపతి వరి పొలంలో వేపనూనెపిచికారిపై వ్యవసాయ అదికారులు ప్రత్యక్ష ప్రదర్వన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ రైతులు,ఎఫ్ఎఫ్ఎస్ ద్వారా ఎంపికైన రైతులు,కాటారం మండల వ్యవసాయ అధికారి,వ్యవ సాయ విస్తరణ అధికారి పాల్గొన్నారు.

జాఫర్‌గఢ్‌కు మరల బ్యాంక్ ఆఫ్ బరోడా రావాలి

ప్రజాపక్షం/జాఫర్‌గఢ్: జాఫర్‌గఢ్ గ్రామానికి చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడా గత కొన్ని సంవత్సరాల క్రితం ఘనపురం కు బదిలీ అయింది. మరల జాఫర్‌గఢ్ గ్రామానికి బ్యాంక్ రావాలని కోరుతూ హైదరాబాద్ హెడ్ ఆఫీస్ టీజీఎన్ డీజీఎం శ్రీ సానిల్ గారిని కలిసి గ్రామంలో సేకరించిన సంతకాల పత్రాన్ని అందజేయడం జరిగింది. దీనిపై డీజీఎం సానుకూలంగా స్పందిస్తూ, నాలుగైదు రోజుల్లో జాఫ ర్‌గఢ్ గ్రామానికి విచ్చేసి స్థలం, భవనాన్ని పరిశీలించి, బ్యాంక్ వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొత్వాల కుమార్, మామిండ్లపల్లి బ్రహ్మం పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన పుట్ట మధు



ప్రజాపక్షం/మహాదేవపూర్: మండలంలోనిపలుబాధిత కుటుంబా లను మంగళవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శిం చారుసీ సందర్భంగా బెగ్లూర గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన సుంకె లక్ష్మి,సంగం నారాయణ,పాస్టర్ బి జోసెఫ్‌లు మరణించగా వారి కుటుంబాను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం బ్రాహ్మణపల్లి ఎస్సీ కాలనిలో బిఆర్ఎస్ పారీట నాయకుడు పేట రాజు తండ్రి లస్మయ్య,ఇటీవల మరనించగా వారి కుటుంబాన్ని పరామర్శించి దైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు,మహిళా నాయకురాలు కేదారి గీతా బాయి, నాయకులు లింగంపెల్లి శ్రీనివాస్ రావు, సుంకె మధు,వెన్న పెల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

ప్రజాపక్షం/మంగపేట: తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు జిల్లా పార్టీ అధ్య క్షులు పైడాకుల అశోక్, మంగపేట మండల అధ్యక్షులు చేట్టిపెల్లి వెంకటేశ్వర్లు సూచనల మేరకు మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో మంగళవారంకాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షులు బడిశా ఆదినారాయణ ఆర్టిఐ చైర్మన్ బండ జగన్ మోహన్ రెడ్డి పార్టీ నాయకులతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండ జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, దేశంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబా లకు అండగా నిలుస్తూ, ప్రజలకు మెరుగైన సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కంకణబద్ధమై పనిచేస్తోందని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథ కాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఈ సంద ర్భంగా ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు సున్నం ఆనందం, కాంగ్రెస్ నాయకులు సోయం ఈశ్వర్ రావు, శీను, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిళా నాయకురాలు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కరువు మండలాల ప్రకటనలో ప్రభుత్వ వివక్ష

ప్రజాపక్షం/భూపాలపల్లి : కరువు మండలాల ప్రకటనలో కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతోందని, రైతులకు సాగునీరు అందించ డంలో నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి విమర్శించారు. మంగళవారం భూపాలపల్లిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలిమెల, మహాముత్తారం, మహాదేవపూర్, కాటారం మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి, గణపురం, మొగుళ్ల పల్లి, రేగొండ, చిట్యాల, మండలాలను విస్మరించడం సరికాదన్నారు. జిల్లాలో కరువు ప్రభావం ఉన్న గణపురం, మొగుళ్లపల్లి, రేగొండ, చిట్యాల, మండలాలను కరువు మండలాలుగా ఎందుకు ప్రకటించలే దని ప్రశ్నించారు. ఈ సమావేశంలో టిఆర్ఎస్ పట్టణ మాజీ అధ్య క్షుడు కటకం జనార్ధన్, టిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ గండ్ర హరీష్ రెడ్డి, సెగ్గం సిద్ధు, కౌన్సిలర్ బొంతల సతీష్, మహిళా నాయకురాలు మాదాసి తిరుపతమ్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/మనోహరాబాద్ : మండలంలోని కూచారం గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దాసరి నరేష్ ముదిరాజ్ జన్మదిన వేడుకలను మండలంలోని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దాసరి నరేష్ ముదిరాజ్‌కు శాలువా కప్పి ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు శేఖర్ గౌడ్, సర్పంచ్ లు నీలం సాయికుమార్ గౌడ్, మోతీబాయి లక్ష్మణ్ సింగ్,మాజీ సర్పంచ్ పూల అర్జున్,మాజీ ఎంపిటిసి శ్రీనివాస్, నాయకులు సాధు సత్యనారాయణ ముదిరాజ్, కుంట రాజు, వెంకట గౌడ్, మండలంలోని పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుల సమావేశం



ప్రజాపక్షం/నర్సాపూర్: తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ సర్పంచ్‌లు గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు, వారి విధులు, నిధులు, బాధ్యతల గురించి చర్చించారు. వివిధ జిల్లాల అధ్యక్షులు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన అధ్యక్షులు హాజరయ్యారు. మెదక్ జిల్లా నుంచి జిల్లా అధ్యక్షుడు మధుకర్ రెడ్డి, సర్పంచ్‌లు పద్మ, దారా సింగ్, తుల సమ్మ, భిక్షపతి, స్రవంతి, కరుణాకర్, సునీత, రాముల నాయక్, సర్సింగ్ నాయక్, గేమ్యా నాయక్, సుధాకర్, భరత్, కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



ప్రజాపక్షం/నిజాంపేట : నిజాంపేట మండలం పరిధిలోని రజాక్‌పల్లి గ్రామంలో మంగళవారం లయన్స్ క్లబ్ అఫ్ రామయాంపేట ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ కనకరాజు సహకారంతో మల్లారెడ్డి హాస్పిటల్ వారిచే ఉచితంగా డెంటల్, కంటి, జనరల్, పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు భాను ప్రకాష్‌రెడ్డి డిస్ట్రిక్ట్ చైర్మన్ లు లయన్ లక్ష్మణ్ యాదవ్, లయన్ కైలాసం రామాయంపేట లయన్స్‌క్లబ్ అధ్యక్షులు లయన్ తిరుపతి, డైరెక్టర్‌లు లయన్ బట్ట మహేష్, లయన్ నవీన్ పాల్గొన్నారు.

సమాచారం లేకుండా భూ సర్వే ఎలా చేస్తారు?



ప్రజాపక్షం/శివ్వంపేట : కాస్తు కబ్జాలో ఉన్న పట్టాదారుకు సమాచారం ఇవ్వకుండా జిల్లా ఎడి భూసర్వేను ఏ విధంగా నిర్వహిస్తారని బండె విజయరెడ్డి దంపతులు మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. విజయరెడ్డి మాట్లాడుతూ సికింద్లాపూర్‌లోని సర్వేనంబర్ 285లో 3 ఎకరాల భూమిని తన కూతురు పావనిరెడ్డి పేరిట గ్రామానికి చెందిన దొంతిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వద్ద 2019లో ఖరీదుకు కొనుగోలు చేశామన్నారు. అప్పటినుంచి అందులో పంటను సాగు చేస్తున్నామని, తమ భూమికి ఆనుకొని ఉన్న 288 సర్వేనంబర్ భూమి మాకున్నన భూమిలో ఉందని అమెంజి భూ సర్వే చేయిస్తే పట్టాదారుకు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా సర్వే ఎలా చేస్తారని బాధితులు ప్రశ్నించారు. కాస్తులో మేముండగా ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చామని గోడను కట్టే ప్రయత్నం చేయడం దారుణమని ఆమె అన్నారు. అక్రమంగా రెండుసార్లు రిజిస్ట్రేషన్ చేసుకొని ఇప్పుడు అధికారాన్ని అడ్డుపెట్టుకొని మా భూమిలోకి వచ్చేలా ప్రయత్నాలు చేస్తూ అన్యాయం చేయాలని చూస్తున్నారని వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టాదారు సమక్షంలో సర్వే చేయాల్సిన జిల్లా ఏడీ ఈరోజు అమిన్‌జి ఇచ్చిన ముడుపులకు తలొగ్గి పట్టాదారులకు అన్యాయం చేస్తున్న ల్యాండ్స్ ఆండ్ సర్వే ఏడీపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు ఏస్తామని ఆమె తెలిపారు.

రహదారులపై ధాన్యం ఆరబెట్టి ప్రమాదాలకు తావివ్వొద్దు

ఎస్పి డి.వి. శ్రీనివాసరావు



ప్రజాపక్షం / మెదక్ : జిల్లాలో రహదారులపై వరి ధాన్యం ఆరబెట్టడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది రైతులు ధాన్యాన్ని రహదారులపై ఆరబెట్టడం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ధాన్యం చుట్టూ రాళ్లు పెట్టడం, నల్లటి పాలిథిన్ కవర్లతో కప్పడం వల్ల ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు వాటిని గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని వెల్లడించారు. రహదారులపై ధాన్యం ఆరబెట్టడం ఇతరుల ప్రాణాలకు ముప్పుగా మారుతుందని స్పష్టం చేశారు. రైతులు రహదారులను వినియోగించకుండా గ్రామ పంచాయతీ ప్రాంగణాలు, ఖాళీ స్థలాలు లేదా రహదారులకు దూరంగా ఉన్న సురక్షిత ప్రదేశాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని, రైతులు తమ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రమాదాల నివారణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

గ్రామం యూనిట్‌గా పంట నష్టపరిహారం అందించాలి

ఎండిపోయిన పంటలను పరిశీలించిన ప్రజా సంఘాల నేతలు



ప్రజాపక్షం /టేక్మాల్ : వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని దన్నారా, మల్కాపూర్, దాదాయిపల్లి గ్రామాల్లో పర్యటించి ఎండిపోయిన వరి, పత్తి పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పెట్టుబడులు, సాగు పరిస్థితులు, పంట నష్ట వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని పంట నష్టాన్ని అంచనా వేసి, సాగు చేసిన ప్రతి రైతుకు పరిహారం అందించాలని కోరారు. కౌలు రైతులను కూడా పరిహారం పంపిణీలో పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ నష్టాలను గుర్తించి బాధిత రైతులకు తక్షణ ఆర్థిక సాయం అందించాలని మెదక్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు బి. కొండల్ రెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ. మల్లేశం, మానవ హక్కుల వేదిక నాయకుడు హైమద్, రైతు స్వరాజ్య వేదిక నాయకుడు భాగయ్య తదితరులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా, రైతు, జర్నలిస్టు సంఘాల నాయకులు నాగరాజు, సురేందర్ రెడ్డి, రైతులు, టీఆర్ఎస్ నాయకులు కరాటే ప్రేమ్ కుమార్, చౌదరి భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లుగా పరిష్కారం కాని జాబ్‌కార్డు సమస్య



ప్రజాపక్షం/శివ్వంపేట : ఏళ్ల తరబడి జాబ్‌కార్డు సమస్యను పరిష్కరించకుండా అడిగినప్పుడల్లా పెండింగ్‌లో పెడుతూ రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని బాధిత కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. శివ్వంపేటకు చెందిన వజ్జపద్మకు 30295 జాబ్‌కార్డులో ఆమె కుటుంబ సభ్యులతో కలిపి 2008లో జాబ్‌కార్డు రాగా ఆ తరువాత పచ్చిన ఏపీఓ అనీల్ కుమార్ వారి జాబ్‌కార్డులో వారి దాయాదుల పేర్లు ఎక్కించి వారికి సంబంధించిన అధార్‌కార్డులను ఈ జాబ్ కార్డుకు లింప చేయడంతో అప్పటి నుంచి పద్మ కుటుంబానికి సంబంధించిన 100 రోజుల పని దినాల్లో కోత విధిస్తూ ఇతరులకు పని దినాలు కల్పిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో వారి కుటుంబాల మద్య అప్పటినుంచి వివాదాలు జరుగుతున్నాయని తెలిపారు. జాబ్‌కార్డులో ఇతర దాయాదుల పేర్లు తొలగించి వారికి కొత్త జాబ్‌కార్డు ఇవ్వాలని గత మూడు సంవత్సరాలుగా మొరపెట్టుకుంటున్నా రేపు, మాపు అంటూ ఏపీఓ కాలయాపన చేయడం తప్పా సమస్యను పరిష్కరించడం లేదని వజ్జ పద్మ, వజ్జ అనితలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరుతడి పంటలు వేసుకోవాలి

వ్యవసాయ అధికారి శ్రీదేవి



ప్రజా పక్షం/రేగోడు: యాసంగి సీజన్‌లో నీరు తక్కువగా ఉపయోగించే పంటలను సాగు చేయాలని రేగోడు మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి అన్నారు మంగళవారం ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా టి.లింగంపల్లి వ్యవసాయ భూములను పరిశీలించారు బోరు బావుల కింద వరి పంట సాగు చేయొద్దని తక్కువ నీటితో పండే నూనె గింజలు పప్పు దినుసుల పంటలు వేసుకోవాలని రైతులకు సూచించారు ఈ కార్యక్రమంలో పిఎస్‌సిఎస్ డైరెక్టర్ శివాజీ రావు, సర్పంచ్ ఆనందం, కార్యదర్శి, వ్యవసాయ విస్తరణ అధికారి మీనా కుమారి పాల్గొన్నారు.

రేగోడు మండలానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయండి

మంత్రిని కలిసి నాయకుల విజ్ఞప్తి



ప్రజాపక్షం/రేగోడు: మండల కేంద్రం రేగోడులో సమస్యలు ఉన్నాయని అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాను మంగళవారం డిసిసి వైస్ ప్రెసిడెంట్ విజయభాస్కర్, మాజీ కోఆప్షన్ చోటు మియా కలిసి వినతి పత్రం అందజేశారు. రేగోడులో రోడ్డు, మురికి కాలువలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు

'జెసిఐ ఇండియా ఫౌండేషన్' స్కాలర్ షిప్స్‌కు విద్యార్థులు ఎంపిక



ప్రజాపక్షం/పాపన్నపేట: 2026 సంవత్సరానికి గాను జెసిఐ ఇండియా ఫౌండేషన్స్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌లో భాగంగా జెసిఐ హైదరాబాద్ ఛాంపియన్ విభాగంలో మెదక్ జిల్లా, పాపన్నపేట మండల పరిధిలోని నాగ్సన్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు గోకని భార్గవి,రియాజ్ లు ఎంపికయ్యారని జెసిఐ హైదరాబాద్ ఛాంపియన్ మేనేజర్ కిషోర్ కుమార్ మంగళవారం రోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్ టైమ్ స్కాలర్షిప్ కింద సంవత్సరానికి రూ.3000 రూపాయలు నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాలో జమ చేయబడతాయనీ, ఈ స్కాలర్‌షిప్ అనేది ఉత్తమ ప్రతిమ కనబరిచిన అనాథ పిల్లలు లేదా సింగిల్ పేరెంట్ గల పిల్లలకి అందించడం జరుగుతుందన్నారు. ప్రతిభ గల ఎంపికైన విద్యార్థులు మరింత పట్టుదలతో చదివి ఉజ్వల భవిష్యత్తును పొందాలని కిశోర్ కుమార్ తెలిపారు. ఈ సంవత్సరమే కాకుండా గత మూడు సంవత్సరాల నుండి నాగసాన్ పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఈ స్కాలర్షిప్ అందిస్తున్నందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నజీరుద్దీన్, ఉపాధ్యాయులు బి.అశోక్ కుమార్,జెసిఐ ఫౌండేషన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి పరిశీలన



ప్రజాపక్షం/మనోహరాబాద్: మనోహరాబాద్ మండల పరిధిలోని కళ్లకల్ గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా మంగళవారం గ్రామంలో ఏఈ రాజ్ కుమార్ విద్యుత్ అధికారులతో కలిసి పర్యటించి విద్యుత్ సరఫరా పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న అంతరాయాలు, స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు విద్యుత్ లైన్ల నిర్వహణపై దృష్టి సారించారు. గ్రామ ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజ్ కుమార్ తో పాటు విద్యుత్ అధికారులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

మళ్లీ వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే
మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు



ప్రజాపక్షం/ సిద్దిపేట : ప్రజలు మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వం .. కెసిఆర్ రావాలని కోరుకుంటున్నారని..వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి హరీష్‌రావు సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేశారు. సిద్దిపేట నియోజకవర్గం చిన్నకోడూరు మండలం నూతనంగా ఎన్నికైన బిఆర్ఎస్‌వి నూతన కమిటీలను మాజీ మంత్రి హరీష్‌రావు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వక పేద విద్యార్థులను సిఎం రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని విమర్శించారు. మొదటి సంవత్సరం లో 2లక్షల ఉద్యోగాలు ఇస్తా అని యువతను కాంగ్రెస్ ప్రభుత్వం. మోసం చేసిందన్నారు. ఉద్యోగాలు లేవని, ... ఉద్యోగ భృతి ఊసు లేదన్నారు. మూడు రైతు బంధులు ఎగొట్టాడని, . దేవుడు పేర్లు చెప్పి సగం రుణ మాఫీ చేసి రైతు లను మోసం చేసారని ఎద్దేవా చేశారు. 4వేల పెన్షన్ ఇస్తా అని ఒక్కొక్కరికి 75వేలు బాకీ.. మహిళలకు 2500 ఇస్తా అని లక్ష రూపాయలు బాకీ కాంగ్రెస్ సర్కార్ బాకి పడ్డారన్నారు. సిద్దిపేట ను చూసి నేర్చుకొనేవిధంగా అభివృద్ధి చేసుకున్నామన్నారు. వచ్చేది బిఆర్ ఎస్ ప్రభుత్వమే.. సిద్దిపేట ప్రగతి పరుగుల పెట్టి బాధ్యత నాదన్నారు. నాడు నినాదాలుగా ఉన్న ఎన్నో కార్యక్రమాలు నేడు నిజాలు చేసుకున్నామన్నారు. చిన్నకోడూరు నెత్తి మీద నిండు కుండల రంగనాయక సాగర్, అంత గిరి రిజర్వాయర్లు ఉన్నాయన్నారు. వచ్చే కొద్దీ రోజుల్లో సిద్దిపేట, హైదరాబాద్, తిరుపతి కి జెట్ స్పీడ్ లో రైలు ప్రారంభమవుతాయన్నారు. తెలంగాణ ఉద్యమం నుండి వచ్చిన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నేడు మన కళ్ళముందు ఉన్నాయి. అయిల్ ఫామ్ సాగు కు నెలవు అని ... రైతులకు మేలు జరుగుతుందన్నారు. సిద్దిపేట విద్యాలయాల నిలయం గా మార్చుకున్నట్లు తెలిపారు. ఏ కొత్త కార్యక్రమం అయిన సిద్దిపేట లో ప్రారంభించుకున్నామన్నారు. నా కళ్లు ఎంత ముఖ్యమో సిద్దిపేట ప్రజల కళ్లు ముఖ్యం అని అందులో నుండి పుట్టిందే ఎల్వి ప్రసాద్ ఆసుపత్రి అన్నారు. సిద్దిపేట ప్రాంత పిల్లలే సిద్దిపేటలో ఉద్యోగం చేసేల యువతకు వరం ఐటి టవర్ అన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో నాడు గుంతలు లేని రోడ్లు... నేడు గుంతల మయంగా రోడ్లు మారాయనన్నారు. విద్యార్థి దశ నుండే రేపటి రాజకీయ నాయకులుగా ఎదుగుతారన్నారు. సోషల్ మీడియా లో ప్రభుత్వ తప్పిదాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

రైతులు అధైర్యపడొద్దు

అదనపు కలెక్టర్ కె లక్ష్మీ కిరణ్



ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: సిద్దిపేట జిల్లాలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2026– 27కు సంబంధించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొత్తం 418 ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నీ ప్రారంభించబడి, ధాన్యం కొనుగోలుకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాయని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ కె. లక్ష్మీ కిరణ్ తెలిపారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక వసతులు,సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావు గా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి జాప్యం జరగకుండా రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి నాణ్యమైన ధాన్యాన్ని, నిబంధనల ప్రకారం వెంటనే కొనుగోలు చేయాలని పిపిసి నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే సంచుల్లో నింపి, కేటాయించిన రైస్ మిల్లులు లేదా గోదాములకు ఎలాంటి జాప్యం లేకుండా తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించినట్లు పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని,ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని సమీపంలోని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని కోరారు.

రైతాంగానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

లింగాల శ్రీనివాస్

ప్రజాపక్షం/బెజ్జంకిః రైతాంగానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పార్టీ మండలాధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో రైతులకు 2 లక్షల రుణ మాఫీ చేసిందని గుర్తు చేశారు.అలాగే సబ్సిడీపై వేరుశనగ,పొద్దు తిరుగుడు విత్తనాలను,వ్యవసాయ పరికరాలను అందిస్తుందని అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు లక్ష రుణ మాఫీ చేయకుండా,వ్యవసాయ సబ్సిడీని ఎత్తేసిన నీచ చరిత్ర బీఆర్ఎస్‌దని ఎద్దేవా చేవారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు ధీమాగా ఉన్నారని వ్యక్తం చేశారు.

నూతన సిఐకి శుభాకాంక్షలు



ప్రజాపక్షం /పటాన్ చెరు : ఇస్నాపూర్ నూతన పోలీస్ స్టేషన్ సిఐని మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి పండుగ శుభాకాంక్షలు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ నిజాముద్దీన్ బాబా తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాముద్దీన్ బాబాతో పాటు రేణుకా ఎల్లమ్మ తల్లి ఆటో యూనియన్ సభ్యులు పాల్గొని నూతన సిఐ టి మహేష్‌కు శాలువతో సన్మానించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐతో పరిచయం చేసుకుని ప్రజలు ,ఆటో కార్మికులకు సంబందించిన స్థానిక అంశాలపై మర్యాద పూర్వకంగా మాట్లాడం జరిగింది. ప్రజలందరికి దీపావళి పండుగ సుఖసంతోషాలతో పాటు ఆయురారోగ్యాలు ,శాంతతతి సౌభాగ్యాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆటో యూనియన్ సభ్యులు డి. రాము, రాజు సత్వేల్, అనిల్, లక్ష్మణ్, ఎడుకొండలు ,లింగం, జంగయ్య, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేటలో వ్యాపారులతో ఎమ్మెల్యే సమావేశం



ప్రజాపక్షం /సంగారెడ్డి : సదాశివపేట పట్టణంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతప్రభాకర్ పర్యటించారు. దీపావళి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని వివిధ వాణిజ్య వ్యాపార సంస్థల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని వ్యాపారులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలోని ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లో పర్యటిస్తూ వివిధ దుకాణాల యజమానులు, వ్యాపారులను ఆప్యాయంగా పల కరించారు. వ్యాపారాలు ఏలా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్ పరిస్థితులు ఏలా ఉనాయి? వినియోగదారుల కొనుగోలు శక్తి ఏలా ఉంది ? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యాపారులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గతంలో పొలిస్తే నిత్యావసర సరుకుల ధరలు గణనీయంగా పెరగడంతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరిగిందని, దాని ప్రభావం వ్యాపారులపై కూడా పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో కొనుగోళ్లు తగ్గిపోయాయని గతంలో మాదిరగా వ్యాపారం జరగడం లేదని తెలిపారు. ప్రజల చేతుల్లో డబ్బులు లేకపోవడంతో చిన్న చిన్న వ్యాపారాలు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వివరించారు. అదే విధంగా ప్రస్తుత ప్రభుత్వ పాలన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే వ్యాపారులు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో దిద్దిగే నగేష్, చీలమల్లన్న మల్లిఖార్జున్, వంశీ నంక్షయ్, గౌడ్, జగదీష్, చింత గోపాల్, అంజయ్య, నాగుల విజయ్, వీరేశం, కలీం ,పటేల్ పాల్గొన్నారు.

శివానగర్, కంజర్ల చౌరస్తా రోడ్డు పునర్ నిర్మించాలి

బిజెపి మున్సిపల్ అధ్యక్షుడు జగన్ రెడ్డి



ప్రజాపక్షం /పటాన్ చెరు : శివనగర్ గ్రామం నుంచి కంజర ల చౌరస్తా వరకు అధ్వానంగా ఉన్న రోడ్డును వెంటనే పునర్ నిర్మించాలని భారతీయ జనతా పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు కె. జగన్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, జిన్నారం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ వంగటి ప్రతాప్ రెడ్డి,బిజెపి సీనియర్ జిల్లా నాయకుడు కుర్చల్లి నర్సింగరావు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి ప్రభుత్వంగానే కొనసాగుతుందని ప్రజల సమస్యలు పట్టించుకునే పాపాన పోలేదని ఆరోపించారు. రోడ్లు వంటి నిత్యం ప్రజలకు అవసరమైన సేవలను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని జిల్లా అధ్యక్షురాలు ఆరోపించారు. ఏళ్లు గడుస్తున్న ఎక్కడా కూడా ఒక్క తట్ట మట్టి వేసిన పాపాన కాంగ్రెస్ ప్రభుత్వం పోలేదని ప్రజలకు సేవ చేయడం చేతకాని ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని హెచ్చరించారు.

పంట మార్పిడితో అధిక లాభాలు

రైతులకు ఉద్యాన శాఖ అధికారులు సూచన



ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట : ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు నీటిని పొదుపుగా వినియోగిస్తూ పంట మార్పిడికి ప్రాధాన్యత ఇవ్వాలని ఉద్యాన శాఖ అధికారిణి కౌసల్య సూచించారు. మంగళవారం ధూల్మిట్ట మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో శాస్త్రవేత్త శ్వేత మాట్లాడుతూ, ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల్లో ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకుంటూ, పాటించవలసిన జాగ్రత్తలు, నేలలో తేమను కాపాడుకోవడం, పంట మార్పిడి ఉపయోగం వివరించారు. ఆయిల్ పామ్ తోటలో ప్రస్తుతం మల్చింగ్ వేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారిణి కౌసల్య మాట్లాడుతూ, ఉద్యాన పంటల లాభాలు వాటి నుండి వచ్చే దిగుబడిని వివరించారు. ఒక ఎకరం వరి సాగు అవసరం అయ్యే నీరుతో 3 ఎకరాల వరకు కూరగాలు సాగు చేయవచ్చు అని తెలిపారు. పంట మార్పిడి చేసుకొని రైతులు పండ్ల తోటలు, కూరగాయలు, పండించాలని కోరారు. ఆయిల్ పామ్ సాగులో సబ్సిడీలు, అంతర పంటల ద్వారా ఆదాయ మార్గాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గునుకుల లీలా జగన్‌మోహన్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు రాధిక, అఖిల్, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ రాకేష్, డ్రిప్ జిల్లా అధికారి నరేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి పొన్నం



ప్రజాపక్షం / హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో వివిధ కారణలవల్ల చని పోయిన మృతుల కుటుంబాలను మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పరామర్శించారు. హుస్నాబాద్ పట్టణంలోని సీనియర్ జర్నలిస్టులు కొండ లక్ష్మణ్, రవిందర్ తల్లి మంగళవారం ఉదయం చనిపోగా మంత్రి పొన్నం ప్రభాకర్ వారి నివాసానికి వెళ్లి కొండ లక్ష్మి పార్థివదేహంపై పుష్పగుచ్చం ఉంచి నివాళులర్పించారు. ఆనంతరం కొండ లక్ష్మణ్, రవిందర్‌లను పరామర్శించి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం సోమవారం హుస్నాబాద్ మండల పందిల్ల గ్రామ శివారులో రోడ్డు ప్రమాదంలో చనిపోయిన కొండాపూర్ గ్రామానికి చెందిన పైడిపెల్లి శ్రీకాంత్, తన కూతురు మహాన్విల మృతదేహాలపై పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చనిపోవడం చాల బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైరపర్సన్ లక్ష్మి కొమురయ్య, కేడం లింగమూర్తి పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు అండగా సిపిఐ: రూపేష్

ప్రజాపక్షం/బెజ్జంకిః జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మెకు భారత కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందని సిపిఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ తెలిపారు.మంగళవారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు రాష్ట్రంలో ప్రజారోగ్య సేవలను అందించడంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.ఎన్నో ఏళ్ళుగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తు ఆరోగ్య వ్యవస్థలో భాగస్వాములుగా ఉన్న ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతానాన్ని అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.వారి సమస్యలను సానుకూలంగా పరిశీలించి సమ్మెను విరమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

జనగామను కరువు జిల్లాగా ప్రకటించాలి



ప్రజాపక్షం /జనగామ : ఎల్ నినో ప్రభావంతో పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు నష్టపోయినందున జనగామ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో సంక్షేమ పథకాల విషయంలో గతంలో పేదలకు ఇచ్చిన పథకాలు అలానే ఉంచాలన్నారు. మంగళవారం సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ జనగామ జిల్లాలో 4 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం సరియైంది కాదన్నారు. 12 మండలాలను ప్రకటించాలని, ఉపాధి కల్పించాలని, కరువు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు ఇచ్చిన బ్యాంక్ రుణాలు మాఫీ చేయాలని, ప్రత్యామ్నాయ పరిస్థితిలో రెండు వందల రోజుల పని దినాలు కల్పించాలన్నారు. జిల్లాలో 202113లో 1144 మందికి ఇందిరమ్మ ఇళ్ల స్థలాలు ఇచ్చారని, అందులో కొందరు ఇళ్ల నిర్మాణం చేసుకోగా 2019లో బలవంతంగా కూల్చుతున్న నేపథ్యంలో లబ్ధిదారులు కోర్టుకు వెళ్లడం జరిగిందన్నారు. 72 ఇళ్ల విషయంలో కోర్టు స్టే ఇచ్చిందని, నేడు జిల్లా యంత్రాంగం మళ్లీ డ్రా తీసి వేరే వాళ్లకు కేటాయించడంతో గతంలో డ్రా పద్ధతిలో పొంది ఇళ్లను రిపేర్ చేసుకున్న వారంతా రోడ్డు పడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.72 మందిని ఇళ్ల నుండి వెళ్లగొట్టకుండా చూడాలన్నారు. సిపిఎం జాతీయ పార్టీగా నిత్యం ప్రజల పక్షాన ఉంటుందని, ప్రజల కోసం పోరాడుతుందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, జిల్లా కమిటి సభ్యులు గోపి, నరేందర్, నాయకులు గణేష్, లింగం పాల్గొన్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌కు పాత సరుకు

ప్రజాపక్షం/నెక్కొండ: కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు అంటే పాత సామాగ్రికి కొత్త రంగులు అద్దడమేనా? నాణ్యమైన కొత్త మెటీరియల్‌తో పనులు చేపట్టాల్సి ఉండగా, పాత ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చి కొత్త పని పూర్తయినట్లు మమ అనిపించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నెక్కొండ మండలం పనికర గ్రామ సమీపంలో బండారు అశోక్ పొలంలో ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్ పనుల్లో కాంట్రాక్టర్ వ్యవహారశైలి చర్చనీయాంశంగా మారింది. షెడ్డు, తీగలు తదితర సామాగ్రి కొత్తగా ఏర్పాటు చేసినప్పటికీ ట్రాన్స్‌ఫార్మర మాత్రం పాతదే అమర్చినట్లు పనులు కనిపిస్తున్నాయి. పనుల నాణ్యతను పరిశీలించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొత్త పనుల పేరుతో పాత సామాగ్రిని వినియోగిస్తే ప్రభుత్వ నిధుల ప్రయోజనం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్తాయిలో విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాంట్రాక్టర్ ఫిట్ చేసిన ట్రాన్స్‌ఫార్మర్ స్పష్టంగా కనిపిస్తుంది. పాతదానికి రిపేర్ చేసి పెట్టడం ఎంత వరకు సమంజసం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌కు కంపెనీ వారు గ్యారెంటీలు వారంటీలు ఇస్తారు కానీ ఇక్కడ ఇలా చేయడం సమంజసం కాదని రైతులు వాపోతున్నారు.

గ్రామాల్లో గ్రామసభలకు వేళాయె!

11 నుంచి డిసెంబరు 1 వరకు నిర్వహణ
ఎల్ నినో, ప్రత్యామ్నాయ పంటలు, ఇందిరమ్మ ఇళ్లపై చర్చ

ప్రజాపక్షం/పాపన్నపేట: పాపన్నపేట మండలంలోని 40 గ్రామ పంచాయతీల్లో గ్రామసభల నిర్వహణకు అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ నెల 11 నుంచి డిసెంబరు 1 వరకు ఆయా గ్రామాల్లో రోజుకు మూడు గ్రామసభల చొప్పుననిర్వహించనున్నారు. ఈ మేరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గ్రామసభల్లో ఎల్‌నినోప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగు, జలసిరి పనులు, వివి–జి రామ్ జీ పనులు, ఇందిరమ్మ ఇళ్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై చర్చించనున్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజల సమస్యలపైసమీక్షించనున్నారు. తొలిరోజు మూడు గ్రామాల్లో ఈ నెల 11న కొంపల్లి గ్రామంలో ఉదయం 10 గంటలకు, చీకోడ్‌లో మధ్యాహ్నం 12 గంటలకు, కొత్త లింగాయిపల్లిలో మధ్యాహ్నం 2 గంటలకు గ్రామసభలు నిర్వహించనున్నారు. ఇదే తరహాలో నిర్దీత షెడ్యూల్ ప్రకారం మిగిలిన గ్రామాల్లోనూ సమావేశాలు జరుగనున్నాయి. అధికారుల హాజరు తప్పనిసరి. మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ, తహసీల్దార్, వ్యవసాయ అధికారి, పంచాయతీ అధికారి, సంబంధిత ఇంజినీరింగ్ శాఖల ఏఈలు, పశువైద్యాధికారి తదితర శాఖల అధికారులు గ్రామసభలకు హాజరుకావాలని ఆదేశించారు. సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది కూడా సమయానికి హాజరై సమావేశాలను విజయవంతం చేయాలని సూచించారు.

సిఎం సభకు కాంగ్రెస్ శ్రేణులు తరలి రావాలి

డిసిసి అధ్యక్షుడు తూ0కుంట అంక్షారెడ్డి



ప్రజాపక్షం/గజ్వేల్: ఈ నెల 19న సిద్దిపేటలో జరగనున్న సిఎం రేవంత్ రెడ్డి సభను విజయ వంతం చేయాలని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట అంక్షా రెడ్డి స్పష్టం చేశారు. గజ్వేల్ లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. సిద్దిపేట సభలో వివిధ సంక్షేమ పథకాలను సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించనుండగా, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి పెద్దఎత్తున తరలి వచ్చేందుకు చొరవ చూపాలని కోరారు. సిఎం రేవంత్ రెడ్డి సిద్దిపేట పర్యటనను పార్టీ అధిష్టానం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటూ0దని, దీనిని దృష్టిలో పెట్టుకొని పార్టీ నాయకులు, కార్యకర్తలు కీలకంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామాలు, మండలాలు, పట్టణ ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు ప్రజలను కలిసి సభకు ఆహ్వానించాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామం నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో సభకు తరలివచ్చేలా కార్యాచరణ రూపొందించుకోవాలని, తరలింపు ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యకర్తలే పార్టీకి బలమని, పార్టీ కుటుంబ సభ్యులంతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట అంక్షా రెడ్డి విజ్ఞప్తి చేశారు.

గొల్లగూడెంలో ఘనంగా సదర్ సంబరాలు

దున్నపోతుల అలంకరణలు..
యాదవుల సంప్రదాయ నృత్యాలతో సందడి



ప్రజాపక్షం /టేక్మాల్ : మెదక్ జిల్లా టేక్మాల్ మండలం గొల్లగూడెం గ్రామంలో యాదవ సోదరుల ఆధ్వర్యంలో సదర్ పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దున్నపోతులను రంగురంగుల వస్త్రాలు, పూలదండలు, గజ్జెలతో అందంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. డప్పు చప్పుళ్లు, ఒగ్గు డోలు నృత్యాలు, సంప్రదాయ ఆటపాటలతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది. యాదవ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించిన ఈ వేడుకలను తిలకించేందుకు గ్రామస్థులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుధాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప, యువత కార్యదర్శి నాయికోటి భాస్కర్, మాజీ ఎంపీటీసీ సిద్దయ్య, యాదవ సంఘం పెద్దలు, గ్రామ ప్రముఖులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

గోవర్ధనగిరిపై కార్తీక దీపాలతో వెలుగుల సంబరం



ప్రజాపక్షం /నంగారెడ్డి : శ్రీ గోవర్ధన పూజ ,కార్తీక దీపోత్సవాన్ని హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో మంగళవారం నాడు వైభవంగా నిర్వహించారు. భక్తి ,ఆనందం , ఉత్సవాలతో నిండిన ఈ వేడుకలో రంగు రంగుల కార్యక్రమాలు భక్తి పూర్వక సమర్పణలు, గౌరవనీయమైన సంప్రదాయాలు భక్తులు ,సందర్శకుల హృదయాలను ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా గోవర్ధన్ ప ర్వతం యొక్క అద్భుతమైన ప్రతిరూపాన్ని ఏర్పాటు చేశారు. మట్టి పాత్రలు, పత్రాలతో వివిధ సంప్రదాయ స్వీట్లు ,పిండివంటలతో కూడిన అన్న కూటాన్ని సమర్పించారు. సాయంత్రం గోవర్ధన పర్వతం యొక్క అద్భుతమైన ప్రతి రూపాన్ని ఆవిష్కరించారు. కుకీలు, స్వీట్లు, పిం డివంటలు, పండ్లు, మొదలైన వివిధ పదార్థాలతో కూడిన అన్న కూటాన్ని శ్రీ రాధా గోవిందులకు సమర్పించిన అనంతరం భక్తుల దర్శనం పరిక్రమ కోసం ఉంచారు మధు రమైన కీర్తనలు ,శ్రీల ప్రభుపాదులు ,శ్రీ రాధా గోవిందుల గౌరవారం నిర్వహించిన పల్లకి ఉత్సవంతో సాయంత్రం భక్తిమయంగా సాగింది. అనంతరం పవిత్ర దర్శనం హారతి జరిగాయి. పరమ పూజ్య శ్రీమాన్ సత్య గౌర చంద్రస్వామి జీ మహారాజ్ ,శ్రీమద్ భాగవంలో వివరించిన శ్రీ కృష్ణుని గోవర్ధన లీల యొక్క ప్రాముఖ్యతను తన ఉపన్యాసంలో వివరించారు.

శివ స్వాములు మాల ధారణ



ప్రజాపక్షం/ రేగోడు: మండల కేంద్రంలోని గత సంవత్సరాల నుండి కార్తీకమాసంలో ఈ సందర్భంగా శివ స్వామి గురు శివ శంకర స్వామి మాట్లాడుతూ శివమాల భక్తిశ్రద్ధలతోని పూజలు నిర్వహిస్తామని ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో శివమాల ధరిస్తామని అన్నారు 30 నుండి 50 మంది వరకు ప్రతి సంవత్సరం ఇలాగనే కొనసాగుతాయని అన్నారు ఇందులో 20 మంది శ్రీశైలానికి పాదయాత్ర బయలుదేరుతారని అన్నారు ఈ కార్యక్రమంలో శివ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకుంటే సకల శుభాలు



ప్రజాపక్షం / కొల్చారం : ఆదిశక్తి పరాశక్తి శ్రీ రేణుక ఎల్లమ్మను దర్శించుకుంటే భక్తులందరికీ సకల శుభాలు కలుగుతాయని పాల్వంచ మంగమ్మ సత్యనారాయణ గౌడ్, మనీషాదుర్గ ప్రసాద్ గౌడ్ దంపతులు అన్నారు. కొల్చారం మండల కేంద్రంలోని శ్రీ రేణుక మాత మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కొల్చారం గ్రామానికి చెందిన పాల్వంచ మంగమ్మ సత్యనారాయణ గౌడ్, మనీషాదుర్గ ప్రసాద్ గౌడ్ దంపతులు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు పులుగుర్త నాగరాజు శర్మ వేద మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని దంపతులు అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ గౌడ్, అశోక్ గౌడ్, రామా గౌడ్, కృష్ణ గౌడ్, మౌనిక, సురేఖ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌తో రైతులకు ఉపశమనం: డిఇ



ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: సిద్దిపేట అర్బన్ మండలంలోని బక్రిచెప్యాల గ్రామంలో మంగళవారం నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సిద్దిపేట డిఇ రామచంద్రయ్య, ఎడి శ్రీనివాస్, ఎఇ శ్రీధర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఓవర్ లోడ్‌తో అనేక సార్లు ఫీజు లేసి ఎగిరిపోవడం,ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం జరిగిందన్నారు. దీంతో పంట పోలాలు ఎండిపోయాయని రైతులు తెలిపారు. సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి మరోక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అందించి మా సమస్యను పరిష్కరించిన అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

నిస్సహాయులకు న్యాయాన్ని అందించడమే ముఖ్య ఉద్దేశం

రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరీ

ప్రజాపక్షం/భూపాలపల్లి : న్యాయాన్ని పొందలేని నిస్సహాయులకు ఉచితంగా, సమర్థవంతంగా, సత్వరంగా న్యాయాన్ని అందించడమే న్యాయ సేవాధికార సంస్థల ముఖ్య ఉద్దేశం అని తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి సి.హెచ్.పంచాక్షరీ తెలిపారు. జాతీయ న్యాయసేవల దినోత్సవం, సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జయశంకర్ జిల్లా మొగుళ్లపల్లి లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జడ్జి మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాలకు తోడ్పాటును అందించడం న్యాయ సేవల చట్టం యొక్క ప్రథమ కర్తవ్యం అని పేర్కొన్నారు. ఎస్సి, ఎస్టీలు, మహిళలు, చిన్నపిల్లలు, వయోవృద్ధులు న్యాయ సహాయాన్ని పొందడానికి అర్హులు అని జడ్జి తెలిపారు. చిన్న పిల్లలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమం రూపొందించారని అన్నారు. చిన్న పిల్లలపై జరిగే పొక్సో ఘటనలు నిర్మూలన జరగాలని, సైబర్ నేరాల నుండి వారిని రక్షించాలని జడ్జి పేర్కొన్నారు. బాల్య వివాహాలు నిర్మూలన జరగాలని, ఉచిత, నిర్బంద విద్య హక్కు చట్టం, బాల కార్మిక చట్టాలపై అవగాహనా కలిగి ఉండాలని వారు పేర్కొన్నారు. సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మహతి వైష్ణవి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల, సంక్షేమ శాఖ అధికారి మల్లేశ్వరి, మొగుళ్లపల్లి ఎస్సై ఎం.సురేష్, ఎంఇఒ కుమార స్వామి, ఇంచార్జ్ హెడ్ మాస్టర్ వెంకన్న, ఎంజెపి స్కూల్ ఇంచార్జి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు ప్రజా ఉద్యమాలే బాట

ప్రజాపక్షం/గూడూరు; సమాజంలో నెలకొన్న ఆర్థిక సామాజిక అసమానతలు తొలగి కార్మికులు కర్షకులు పేదలు గౌరవంగా జీవించే సమాజం ఏర్పాగాలంటే కమ్యూనిజం మార్గమే సరైనదని సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండల వెంకన్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవిని ఐలయ్య అన్నారు. మంగళవారం గూడూరు మండలం మచ్చర్ల గ్రామంలో కామ్రేడ్ పెనక వెంకన్న(విక్రమ్) చిన్నం కోటి రాసూరి యాకన్నల స్మారకార్థం నిర్వహించిన బహిరంగ సభలో వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సభకు ముందుగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అమరవీరుల స్తూపాల వద్ద జెండా ఆవిష్కరించారు.భారత విప్లవోద్యమంలో ప్రాణాలర్పించిన నాయకులు ఘనంగా నివాళులర్పించారు. గజ్జి లింగయ్య అధ్యక్షతన జరిగిన ఈసభలో నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విధానాలు అమలు చేస్తూ కార్మికులు రైతులు కూలీలు నిరుద్యోగులు విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. దేశ సంపద కొద్దిమంది చేతుల్లోకి వెళ్లే పరిస్థితులు ఏర్పాడుతున్నాయని ప్రజల హక్కుల కోసం ప్రశ్నించే గొంతులను అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. మతం పేరుతో ప్రజల మధ్య విబేదాలు సృష్టించి రాజకీయ ప్రయోజనాలు



పొందాలని చూస్తున్నారని ఆరోపించారు.ఇలాంటి పరిస్థితుల్లో యువత రావాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ గూడూరు డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ సూర్యం జిల్లా నాయకులు కామ్రేడ్ పుల్లన్న మాట్లాడుతూ గోదావరి లోయ ప్రాంతంలో భూమి భూమి భుక్తి దేశ విముక్తి కోసం సాగిన పోరాటాల్లో ఎంతోమంది విప్లవకారులు తమ ప్రాణాలను అర్పించారని గుర్తుచేశారు. భూమి లేని పేదలకు భూమి శ్రమజీవులకు న్యాయం దోపిడికి తావు లేని సమాజం ఏర్పడాలనే లక్ష్యంతో వారు పోరాడారని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలు వృథా కాకుండా వారి ఆశయాలను నేటి తరానికి తెలియజేస్తూ సమానత్వం సామాజిక న్యాయం కోసం ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు ఈకార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు

నూతన ఎస్ఐకి ఎంఆర్పిఎస్ నేతల సన్మానం



ప్రజాపక్షం/నెక్కొండ: నెక్కొండ పోలీస్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన జె శ్రావణ్ కుమార్‌ను ఎంఆర్పిఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంఆర్పిఎస్ టిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి ఈదునూరి యాకయ్య మాదిగ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ టిఎస్ జిల్లా అధ్యక్షులు వడ్డారి కుమార్, వార్డు సభ్యురాలు కందిక ఉమా వెంకన్న, తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జంగిలి భాస్కర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, చౌటపల్లి పివిసిఎస్ వైస్ చైర్మన్ మాసాని యాకూబ్, తెలంగాణ అంబేద్కర్ సంఘం వర్ధన్నపేట నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జిల్లా కనకయ్య పాల్గొన్నారు.

దశదిన కర్మలకు ఆర్థిక సహాయం



ప్రజాపక్షం/మంగపే : తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశానుసారం, జిల్లా పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచన మేరకు మంగళవారం మంగపేట మండలం లోని నిమ్మగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని చింతకుంట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుంజా రాంబాబు కుమారుడు కుంజా సుమంత్ ఇటీవల మృతి చెందాగా విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపల్లి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి హాజరై కుంజా సుమంత్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవతో దశదిన కర్మల నిర్వహణ నిమిత్తం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఆపద సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య మండల మాజీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి, ములుగు మార్కెట్ కమిటీ సభ్యులు కొమురం బాలన్న సీనియర్ నాయకులు కొమురం సారయ్య, శానం సత్యనారాయణ, గంగినేనీ శేషగిరి, మద్దెల ప్రవీణ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివాగు ఇసుక అక్రమ దందాను అరికట్టాలి

ప్రజాపక్షం/టేకుమట్ల: మండలంలోని చలివాగు ప్రవహించే ప్రాంతాల్లో ఉన్న ఇసుకను అక్రమంగా తరలిస్తూ ఇసుక దందాకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. గతంలో అధికారంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనూ, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనూ చలివాగు పరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని వారు ఆరోపించారు. మాజీ ఎంఎల్పీ, ప్రస్తుత ఎంఎల్పీలకు సంబంధించిన రాజకీయ నాయకుల ఆధ్వర్యంలో ఇసుక దందా విచ్చలవిడిగా సాగుతోందని విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం పరస్పరం విమర్శలు చేసుకోవడం మానుకొని, ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని సూచించారు. అక్రమ ఇసుక రవాణా వలన చలివాగు సహజ ప్రవాహానికి, పర్యావరణానికి, భూగర్భ జలాలకు నష్టం కలిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రకృతి వనరులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇసుక తరలిస్తున్న వెహికిల్స్‌కు ఇన్సూరెన్స్ ఉండాలి, డ్రైవర్‌కు లైసెన్స్ ఉండాలని, అగ్రికల్చర్ వెహికిల్స్ నడవాలి, కమర్షియల్ వెహికిల్ నడిపిస్తూ ఇష్టానుసారంగా అక్రమ ఇసుక తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకొని ఇసుక రవాణాను పూర్తిగా నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

పోలీస్ శాఖకు జీవితాంతం రుణపడి ఉంటా: సారయ్య

ప్రజాపక్షం/ములుగుః ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న తనను సకాలంలో ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన ములుగు జిల్లా పోలీస్ శాఖకు జీవితాంతం రుణపడి ఉంటానని కానిస్టేబుల్ యాప సారయ్య తెలిపారు. ఈ నెల 19న విధులకు హాజరయ్యేందుకు మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం మడగూడ నుండి బయలుదేరిన ఆయన నల్ల బెల్లి మండలం శనిగారం గ్రామ పరిధిలో బైక్ ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సారయ్యను సంఘటనా స్థలానికి చేరుకున్న తోటి కానిస్టేబుల్ శంకర్ వెంటనే ములుగు ఏరియా ఆసుపత్రికి



తరలించారు. పరిస్థితి విషమించడంతో హనుమకొండలోని ప్రయివేట్ ఆసుపత్రికి, అక్కడి నుండి హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించారు. తనకు సకాలంలో వైద్యసాయం అందించి ప్రాణాలు కాపాడేందుకు కృషి చేసిన ములుగు ఎస్పి, పోలీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు క్రాంతికుమార్, పోలీస్ కుటుంబ సభ్యులకు తన కుటుంబం తరుపున కృతజ్ఞతలు తెలిపారు. తనలాంటి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో పోలీస్‌శాఖ ముందుంటుందనడానికి తానే నిదర్శనమని పేర్కొన్నారు.

భూమునిపాదం పర్యాటక ప్రాంతంపై గ్రామపంచాయతీ కమిటీకి పూర్తి బాధ్యతలు అప్పగించాలి

ప్రజాపక్షం/గూడూరు; గూడూరు మండల పరిధిలోని సీతానాగరం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతం భీమునిపాదం అభివృద్ధి నిర్వహణ బాధ్యతలను గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా గ్రామసభ ద్వారా నియమించిన ఈడిసీ భీమునిపాదం కమిటికి పూర్తిస్థాయిలో అప్పగించాలని సీతానగరం గ్రామ సర్పంచ్ భూక్య మంగిలాల్ నాయక్ కోరారు. భీమునిపాదం పర్యాటక ప్రాంతం సీతానాగరం రెవెన్యూ పరిధిలోకి వస్తున్నందున గతంలో నుంచే అటవీ రెవెన్యూ శాఖల అధికారులు సీతానారం గ్రామ పంచాయతీ పరిధిలో ఈడీసీ భీమునిపాదం కమిటిని నియమిస్తూ వస్తున్నారని ఆయన గుర్తుచేశారు. గ్రామ ప్రజల భాగస్వామ్యంతో గ్రామసభ ద్వారా నూతనంగా నియమించిన కమిటికి భీమునిపాదం పర్యాటక ప్రాంతానికి సంబంధించిన పూర్తి బాధ్యతలు అప్పగించడం ద్వారా పర్యాట ప్రాంత నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. స్థానిక గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలకు గ్రామసభ ద్వారా ఎంపికైన కమిటి తగిన ప్రాధాన్యత కల్పిస్తూ సంబంధింత అటవీ రెవెన్యూ శాఖల అధికారులు సహకరించాలని కోరారు. భీముని పాదం పర్యాటక ప్రాంత అభివృద్ధి పర్యవేక్షణ నిర్వహణలో నూతన కమిటికి పూర్తి బాధ్యతలు కల్పించాలని సర్పంచ్ భూక్య మంగిలాల్ నాయక్ విజ్ఞప్తి చేశారు

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌గా ఆదివాసులనే నియమించాలని

మంగపేట ఆదివాసీ ప్రజాసంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్

ప్రజాపక్షం/మంగపేట : ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంగపేట మండల జేఏసీ ప్రధాన కార్యదర్శి తాటి నాగరాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేయనున్న ఎస్‌టి కమిషన్ చైర్మన్ తో పాటు సభ్యులుగా ఆదివాసులనే నియమించాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగంలోని ఐదవ, ఆరవ షెడ్యూల్ ద్వారా ఆదివాసులకు కల్పించిన హక్కులు, చట్టాలను పరిరక్షించాల్సిన బాధ్యత ఎస్టీ కమిషన్‌పై ఉందన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని ఖనిజ సంపద, సహజ వనరులు, భూములు, అడవులు, పోడు భూములపై ఆదివాసుల హక్కులను కాపాడాలని కోరారు. అర్హులైన ఆదివాసీ రైతులకు పోడు భూముల పట్టాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివాసుల ఎదుర్కొంటున్న పలు సమస్యలు, హక్కులు, జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలపై పూర్తి అవగాహన కలిగిన ఆదివాసీ ప్రతినిధులకే ఎస్టీ కమిషన్‌లో ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా పని చేసేలా ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివాసి ప్రాంతాల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించి ఆదివాసి ప్రాంతాల అభివృద్ధి సమస్యలు పరిష్కరించాలని ఆదివాసి ప్రజాసంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. ఈ కార్యక్రమంలో ఆదివాసి ప్రజాసంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఎట్టి సారయ్య దొర తోలేం సుధాకర్, కొరెం మొగిలి తోలేం రామకృష్ణ, చందా రమేష్, సొలం వెంకటేశ్వర్లు, ఈసం కృష్ణ, జిగట శ్రీను, సోలం సాయిబాబు, సున్నం, మధు, తోలేం వెంకన్న, పూనెం నరసయ్య, అన్నేబోయిన నరేందర్ పాల్గొన్నారు.



నేడు సమ్మక్క- సారలమ్మ ఇండస్ట్రిస్ ప్రారంభం

ప్రజాపక్షం/గూడూరు; మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం పొనుగోడు గ్రామంలో నేడు బుధవారం నిర్వహించనున్న సమ్మక్క సారలమ్మ ఇండస్ట్రీస్ ప్రారంభోత్సవ వేడుకకు ప్రజా ప్రతినిధులు ప్రముఖులు విచ్చేయన్నట్లు ఇండస్ట్రీస్ నిర్వాహకులు కాంగ్రెస్ మండల యూత్ మండల అధ్యక్షుడు బొల్లి కొండ మధు తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఎంపి పొరిక బలరాం నాయక్ మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు భూక్య ఉమా మురళి నాయక్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు ఈసందర్భంగా ప్రజా ప్రతినిధులు అధికారులు ప్రజలు వ్యాపారవేత్తలు శ్రేయోభిలాషులందరికీ హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నామని ఈప్రారంభోత్సవ వేడుకలో ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమ్మక్క సారలమ్మ ఇండస్ట్రీస్ నిర్వాహకులు కోరారు

అగ్నిప్రమాద బాధితులకు మాజీ ఎమ్మెల్యే ఆర్థిక చేయూత

నలుగురు బాధితులకు రూ.20 వేల ఆర్థిక సాయం

ప్రజాపక్షం/భూపాలపల్లి : భూపాలపల్లి పట్టణంలోని గణేశ్ చౌక్‌లో దీపావళి రోజు రాత్రి



జరిగిన అగ్నిప్రమాదంలో నాలుగు పూల దుకాణాలు దగ్ధమై నష్టపోయిన బాధితులను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మంగళవారం పరామర్శించారు. కాలిపోయిన దుకాణాలను పరిశీలించి బాధితులకు ప్రభుత్వం తరఫున న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వెంటనే తహసీల్దార్‌కు ఫోన్ చేసి బాధితులకు త్వరగా ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బాధితులు పర్ధం చంద్రకళ భూమయ్య, ఇర్రాల జానీ, ఇర్రాల లక్ష్మీ, మల్లికార్జున్‌లకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గండ్ర హరీష్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కటకం జనార్దన్, సెగ్గం సిద్దు, మాడ హరీష్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.